ప్రజాశక్తి
ఆదివారం 29 డిసెంబరు, 2024
5
శ్రీకాకుళం

## 3న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

### జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఈ నెల 3న జెడ్‌పిలో జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ల్.ఎన్.వి.శ్రీధర్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్థాయీ సంఘాల సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. ఉదయం 10.30 గంటలకు 6వ స్థాయి, 11.30 గంటలకు 3వ స్థాయి, మధ్యాహ్నం 12.30 గంటలకు 5వ స్థాయి సంఘం సమావేశం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 2,4,1, 7స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్
- 43వ జిల్లా మహాసభలు ప్రారంభం

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. టెక్కలిలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు డి.చందు అధ్యక్షతన 43వ జిల్లా మహాసభలు శనివారం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ కూడలి నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో సమీపంలో బహిరంగ సభలో మాట్లాడారు. విద్యారంగంలో ఉండే సమస్యలపై, విద్యార్థుల హక్కుల కోసం ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం పోరాడుతుందని అన్నారు. అందులో భాగంగా దేశంలో మతోన్మాదు భావజాలాలతో విద్యార్థుల మెదడులోకి మనువాదాన్ని చెప్పిస్తే భగత్ సింగ్ వారసులుగా లౌకికత్వాన్ని సమాజంతటా విస్తరిస్తామని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానాల్లోనే తప్ప వాస్తవాల్లో విద్యార్థులే సమస్యలపై సరైన పరిష్కారాలు చూపించడం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా ఇది మంచి ప్రభుత్వం అని తమకు తామే ఒక గుర్తింపు కార్డును ఇచ్చుకునే పరిస్థితిలో ఉన్నాయి. కానీ రాష్ట్రంలోని ప్రధాన సమస్యలపై ఎటువంటి స్పందన లేదని అన్నారు. ఇప్పటికే విద్యార్థుల సత్తా ప్రపంచ రాజకీయ పరిస్థితులనే మార్చే దిశగా అడుగులు వేస్తుందని అన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే మన దేశంలోనూ పాలకులకు విద్యార్థులు అటువంటి సమాధానమే చెప్తారని హెచ్చరించారు. సనాతన ధర్మ రక్షణలో ఉంటున్నామని చెప్తూ ప్రజలను మభ్యపెడుతున్నాయని అన్నారు. జిల్లా కార్యదర్శి హరీష్ మాట్లాడుతూ ఇచ్ఛాపురం నుంచి ఎచ్చెర్ల నియోజకవర్గం వరకు ఉండే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపైన ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం పోరాడుతుందని అన్నారు. వారికోసం ఎంతటి ఉద్యమానైనా భవిష్యత్‌లో చేయడానికి సంసిద్ధమని స్పష్టం చేశారు. జిల్లాలో అగ్రగామిగా ఉన్న శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలకు సొంత హాస్టల్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. తక్షణమే కళాశాలకు హాస్టల్ కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లాలోని హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మూడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సొంత భవనాలు లేక విద్యార్థులు అరకొరకు చదువులు చదువుతున్నారని అన్నారు. తక్షణమే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా గర్ల్స్ కన్వీనర్ పి.పవిత్ర మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల అభ్యున్నతకి వాగ్దానాలు మాత్రమే చేస్తున్నారని, వాస్తవాలు అవి వెలుగు చూడడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు లోపే రాష్ట్రంలో ఎన్నో హత్యలు, అత్యాచారాలు జరిగిన ప్రజాప్రతినిధులు కేవలం పత్రికా ప్రకటనలు పరిమితమయ్యారని అన్నారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు యు.దుర్గాప్రసాద్, సిహెచ్.రాజు, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్ పాల్గొన్నారు.

# దేహదారుఢ్య పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

### ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాష్ట్రస్థాయి రిక్రూట్మెంట్ బోర్డు పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా జిల్లాకు సంబంధించి ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో ఉత్తీర్ణులైన 7,390 మంది మహిళలు (1175), 6,215 పురుషులు అభ్యర్థులకు ఎచ్చెర్ల జిల్లా పోలీస్ ఆర్మ్ పోలీస్ రిజర్వ్ పరేడ్ మైదానంలో ఈ నెల 30 నుంచి వచ్చే ఏడాది జనవరి 18 వరకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో దేహదారుఢ్య పరీక్షల నిర్వహణ విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులతో, సిబ్బందితో శనివారం ఎచ్చెర్ల జిల్లా పోలీసు ఆర్మ్ రిజర్వ్ పరేడ్ మైదానంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విధి విధానాలపై దిశ నిర్దేశాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఫిజికల్ మెజర్మెంట్, ఎఫిషియన్సీ పరీక్షలను ప్రణాళికాబద్ధంగా, సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా సిబ్బంది బాధ్యతతో పని చేయాలని అవగాహన కల్పించారు. అభ్యరుథలను క్రమపద్ధతిలో ఒక క్యూ లైన్లలో మైదానంలోకి అనుమతించి వారిపై మర్యాదగా, సహనంతో వ్యవహరించాలన్నారు. పోలీసు కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షల రిక్రూట్‌మెంట్ పూర్తయ్యే వరకు నిర్దేశించిన సమయానికి ముందే మైదానంలో హాజరుగా

సమీక్షిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఉండాలన్నా రు. దేహదారుఢ్య పరీక్షలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, సిసి కెమెరాలు పర్యవేక్షణలో పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు, వైద్య శిబిరాన్ని, అంబులెన్స్ ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు మైదానంలోకి ప్రవేశించిన మొదలుకుని, వారు దేహదారుఢ్య పరీక్షలు ముగించుకుని తిరిగి వెళ్లే వరకూ వారికి అర్థమయ్యే రీతిలో ప్రతి పరీక్ష అంశాన్ని సూచించే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణత పొందిన ఫలితాల కాపీని తప్పక తీసుకురావాలన్నారు. సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించమన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ కల్పించే దళారీలు మాటలు నమ్మవద్దని సూచించారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రచారం చేస్తే వారి వివరాలు పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి కె.వి.రమణ, డిఎస్‌పిలు అప్పారావు, మూర్తి, ప్రసాదరావు, శేషాద్రి, రాంబాబు, శివారామి రెడ్డి, ఎఒ గోపినాథ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న ఎంపిడిఒ హరిహరరావు

## ఎచ్చెర్ల ఎంపిడిఒపై దాడి

### ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, ఎచ్చెర్ల

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఎంపిడిఒ సీపాన హరిహరరావుపై కొందరు వైసిపి నాయకులు దూషణలకు పాల్పడుతూ దాడికి పాల్పడ్డారు. వెండర్ల రిజిస్ట్రేషన్‌పై అడుగుతున్న సమయంలో వైసిపి నాయకులు దూషిస్తూ దాడి చేశారు. తీవ్ర భయాందోళనకు గురైన ఎంపిడిఒ గది నుంచి బయటకు వచ్చి తన కుర్చీలో కూర్చొని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయాన్ని గమనించిన కార్యాలయం సిబ్బంది ఎంపిడిఒను స్థానిక పిహెచ్‌సికి తరలించారు.

వార్త మెయిన్‌లో...

# ప్రగతి పలుకులు... అభివృద్ధి భ్రమలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వానికి, ఆ పార్టీ ప్రజాప్రతినిధులకు ఎయిర్‌పోర్టు వ్యతిరేక ధ్వనులు కర్ణకఠోరంగా మారుతున్నాయి. మందసలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మించాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. మందస మండలంలోని బిడిమి, బేతాళపురం, లక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో 1383 ఎకరాలను అధికారులు ఇప్పటికే సర్వే చేశారు. దీనిపై సర్వే చేసిన నాటి నుంచే ఆయా గ్రామాల ప్రజల నుంచి స్పందన కనిపించింది. గ్రామాల్లో ధర్నాకు సైతం దిగారు. కొబ్బరి, జీడి, మామిడి తోటలపై బతుకుతున్న తాము నిరాశ్రయులవుతామనే ఆందోళన అందరిలోనూ నెలకొంది. ప్రజల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో వారికి అండగా నిలిచేందుకు వామపక్షాలు నడుంబిగించాయి. ఇప్పటికే ఆయా గ్రామాల్లో నాయకులు పర్యటించి ప్రజలకు భరోసానిచ్చే ప్రయత్నం చేశారు. ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా వాణిని వినిపించే వారందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి ఆయా గ్రామాల ప్రజలకు అండగా నిలిచేందుకు సిద్ధమవుతున్నాయి. ఎయిర్‌పోర్టు నిర్మాణం, బలవంతంగా భూముల సేకరణ అంశంపై పలుమార్లు సమావేశమై కార్యాచరణను రూపొందించారు. ఆందోళనల్లో భాగంగా వచ్చే నెల ఆరో తేదీన పలాస ఆర్‌డిఒ కార్యాలయంలో ధర్నా చేపట్టాలని నిర్ణయించాయి.

వామపక్షాలు చేస్తున్న ప్రయత్నాలు, వారికి ప్రజల నుంచి వస్తున్న మద్ధతు చూసి టిడిపి కూటమి పెద్దల్లో ఆందోళన రేకెత్తుతోంది. ముఖ్యంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అదే ప్రాంతంలో ఉండటంతో ఆమెకు కాస్తా వ్యతిరేక ధ్వనుల తీవ్రత పాళ్లు కొంచెం ఎక్కువగానే ఉన్నాయి. తానెవరికీ భయపడనని బయటకు మేకపోతు గాంభీర్యం ప్రకటిస్తూనే, దానిని కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తోందంటూ తనపై వ్యతిరేకత రాకుండా జాగ్రత్తపడుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పోర్టులు, థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు సందర్భంగా వచ్చే వ్యతిరేకతను ఎలా హేండిల్ చేయాలో బాబుకు తెలిసినంతగా వేరెవ్వరికీ తెలియదనడం అతిశయోక్తి కాకపోవచ్చు. 2014-19 టిడిపి హయాంలో భావనపాడు పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం ప్రతిపాదించిన సందర్భంగా ఆ ప్రాంతంలో ఉవెత్తున ఉద్యమం లేచిన విషయం మనం చూశాం. రాజకీయ పార్టీల వారిగా ప్రజలను విడదీసి, ముఖ్య నాయకులు ఆక్రమించుకున్న భూములకు పరిహారం ఇచ్చి ఉద్యమాన్ని నీరుగార్చేందుకు చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేసింది. అయితే ప్రజా వ్యతిరేకత ముందు అవి నెరవేరలేదు. ఇప్పుడు వాటిలో ఒక అస్త్రాన్ని టిడిపి అమ్ములపొదిలో నుంచి తీసినట్లు తెలుస్తోంది. ఆయా గ్రామాలకు చెందిన టిడిపి నాయకులను ఎమ్మెల్యే శిరీష పిలిచి భూములకు రెండున్న రెట్లు పరిహారం ఇస్తామని, ఎయిర్‌పోర్టుతో జిల్లా అభివృద్ధి చెందుతుందని అంతా సహకరించాలని కోరినట్లు తెలిసింది. జిల్లాను అభివృద్ధి చేయాలనుకుంటే చేయొచ్చని, తమ భూములు తీసుకునే అభివృద్ధి చేయాలా అని ఆ ప్రాంతంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఎయిర్‌పోర్టు నిర్మాణం వద్దంటూ ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుంటే వైసిపి వైఖరి విచిత్రంగా ఉంది. ఎయిర్‌పోర్టు వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లిలో నిర్మించాలంటూ మాజీ మంత్రి అప్పలరాజు కొత్త నినాదం అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉప్పు భూములు, కొద్ది మంది రైతుల నుంచి భూమి సేకరిస్తే ఎయిర్‌పోర్టు నిర్మించొచ్చంటూ సలహా ఇచ్చారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల తరుపున నిలబడి మాట్లాడాల్సిన మాజీ మంత్రివర్యులు వారు వద్దంటున్న ఎయిర్‌పోర్టును ఎందుకు కావాలనుకుంటున్నారో ప్రజలకు అర్థం కావడం లేదు. మాజీ మంత్రివర్యులు ఓపెన్‌గా ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను పార్టీ నిర్ణయంగానే చూడాల్సి ఉంటుంది. సార్వత్రిక ఎన్నికల్లో పెల్లుబికిన ప్రజావ్యతిరేకతతో తుడుచుకుపెట్టుకుపోయిన ఆ పార్టీ ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వెళ్లాలనుకుంటుందా? లేదా? ప్రజల తరుపున నిలిచి ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకుంటుందా? ఇది ఆ పార్టీ తేల్చుకోవాల్సి ఉంది.

పాలకులు తమకు కావాల్సిన పనులను చక్కపెట్టుకునేందుకు అభివృద్ధి ముసుగు తొడగడం ఫ్యాషనైపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నవంబరులో జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంలో మూలపేటలో పోర్టు, టెక్కలి, పలాస ప్రాంతంలో ఎయిర్‌పోర్టు వస్తుందని, జిల్లా రూపు రేఖలే మారిపోతాయన్నట్లుగా ఈదుపురం సభలో ఎంతో గొప్పగా ప్రకటించారు. కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అదే నినాదాన్ని జనాల్లోకి విస్తృతంగా ప్రజల్లో తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. చంద్రబాబు, రామ్మోహన్ నాయుడు కృషితో వెనుకబడిన జిల్లాకు ఎయిర్‌పోర్టు వస్తోందని, జిల్లా ఆర్థికంగా అభివృద్ధి చెందిపోతుందంటూ భ్రమలు కల్పించడంలో నాయకులంతా పోటీపడుతున్నారు. జిల్లాను, ఉద్దానం ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలంటే ఉన్న అవకాశాలను వదిలి ఎయిర్‌పోర్టు చుట్టూ ఊహల్లో విహరింపచేస్తున్నారు. ఒడిశా రాష్ట్రంతో ఉన్న వంశధార జలవివాదం నేపథ్యంలో ఏళ్ల తరబడి ఆగిపోయిన నేరడి బ్యారేజీ నిర్మాణంపై ఎవరూ మాట్లాడటం లేదు. ఒడిశాలో బిజెపి ప్రభుత్వమే ఉన్నా సమస్య పరిష్కారానికి ముఖమంత్రి చంద్రబాబు కనీసం చొరవ చూపే ప్రయత్నం చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జీడి పిక్కలకు 80 కేజీల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర చెల్లింపు, ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయాలంటూ చాలా ఏళ్లుగా ఉద్దానం రైతులు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరిష తరుపున ప్రచారం కోసం పలాస వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు జీడి పంటకు మద్దతు ధర ప్రకటిస్తామని హామీ సైతం ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకోవాలని బాబుకు గుర్తు చేసే బాధ్యత ఎమ్మెల్యే శిరీషకు లేదా? పంటకు మంచి ధర వస్తే రైతుల ఆదాయం పెరిగి అది జిల్లా అభివృద్ధికి దోహదపడుతుంది కదా. ఇవన్నీ వదిలేసి ఎయిర్‌పోర్టుపై కూటమి నేతలు మక్కువ చూపడమేమిటి అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అదీ గాక అది సరుకు రవాణా, కొంత మంది ప్రముఖులు వచ్చి వెళ్లడానికి నిర్మిస్తున్న ఎయిర్‌పోర్టుతో ఇక్కడి ప్రజలకు ఏం ప్రయోజనం? వీటి కోసం కూటమి నేతలు వెంపర్లాడటమెందుకో? ఇప్పటికయినా ప్రభుత్వం కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి. లేకంటే ప్రజల నుంచి వచ్చే స్పందన వేరేగా ఉంటుంది. సోంపేట, కాకరాపల్లి థర్మల్ విద్యుత్కేంద్రాలకు వ్యతిరేకంగా ప్రజలు సాగించిన పోరాటాలు, ప్రభుత్వం వెనక్కి తగ్గి వాటిని రద్దు చేసిన అనుభవాలు జిల్లాకు చెందిన టిడిపి నేతలకు తెలియందేమీ కాదు. వాటిని జ్ఞప్తికి తెచ్చుకుని ముందుకు వెళ్తే బాగుంటుందనే అభిప్రాయం వినిపిస్తోంది.

# జగన్ విధానాల వల్లే ఛార్జీల పెంపు

### ప్రభుత్వ విప్ అశోక్

అశోక్, విప్

**కవిటి :** విద్యుత్ ఛార్జీల పెంపుపై వైసిపి నాయకులు ధర్నాలు చేయడం దెయ్యాల వేదాలు వల్లించినట్లు ఉందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. 2014లో 22.5 మిలియన్ యూనిట్ల లోటుతో పాలన ప్రారంభించిన చంద్రబాబు నాయుడు 2019 వచ్చేసరికి విద్యుత్ మిగులు రాష్ట్రంగా తీర్చిదిద్దారని అన్నారు. అనంతరం మిగులు విద్యుత్‌తో పాలన ప్రారంభించిన మాజీ సిఎం జగన్ ఐదేళ్లలో 10 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం మోపారని ఆరోపించారు. జగన్ పాలనలో మైలవరం ప్లాంటుపై దాడిచేసి ధ్వంసం చేశారని, చట్ట విరుద్ధంగా పిపిఎలు రద్దు చేయడంతో తక్కువ ధరకే వచ్చే 7వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని కోల్పోయిందని అన్నారు. అలా కాకుండా వారిని ప్రోత్సహించి ఉంటే ప్రస్తుతం మరో 10 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ఎన్ని అసత్య ఆరోపణలు చేసినా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని, దానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# పారిశ్రామికరంగం నిరాశాజనకం

- పట్టాలెక్కని కొత్త యూనిట్లు
- జిల్లాలో కొత్తగా ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాని వైనం
- హక్కుల సాధనకు కార్మికుల నిరంతర పోరు
- సమస్యలపై రోడ్డెక్కిన స్కీమ్‌వర్కర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ ఏడాది పారిశ్రామికంగా పెద్దగా పురోగతి కనిపించలేదు. అడపాదడపా పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చినా పట్టాలెక్కలేదు. ముడిసరుకులు, విద్యుత్ నిర్వహణ భారంతో ఒక్కొక్కటిగా పరిశ్రమలు మూతపడ్డాయి. కొత్త పరిశ్రమలు రాకపోవడం, ఉన్నవి మూతపడడంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఎప్పటిమాదిరిగానే యాజమాన్యాల మొండివైఖరికి వ్యతిరేకంగా పలు ప్రాంతాల్లో కార్మికుల ఆందోళనలు కొనసాగాయి. స్కీమ్‌వర్కర్ల సమస్యల పరిష్కారంలో పాలకులు ఉదాసీనంగా వ్యవహరించారు. డిమాండ్ల సాధనకు వారు సైతం రోడ్డెక్కారు.

జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం ఇథనాల్, పేపర్, ఫార్మాస్యూటికల్స్ పవర్ జనరేషన్, గ్రానైట్ వంటి భారీ, మెగా పరిశ్రమలు 40 వరకు ఉన్నాయి. వీటి ద్వారా 63,070 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు ప్రభుత్వం లెక్కలు చెప్తోంది. వీటితోపాటు రైస్ మిల్లులు, జీడిపప్పు పరిశ్రమలు, పేపర్ ప్లేట్ ఉత్పత్తులు, పాలిథిన్ క్యారీ బ్యాగులు, ఇత్తడి వంటి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు 4,083 పరిశ్రమలు ఉన్నాయి. జిల్లాలో గతేడాది కాలంలో కొత్తగా ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాలేదు. రణస్థలం మండలం సంచాంలో ఏడాదికి తొమ్మిది వేలు మెట్రిక్ టన్నుల మందుల ఉత్పత్తితో రూ.350 కోట్లతో బల్క్ డ్రగ్ ఉత్పత్తులను ప్రారంభించేందుకు హైయాసింథాస్ ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. పరిశ్రమలో ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా వెయ్యి మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. పరిశ్రమకు కావాల్సిన 11.41 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పగించాల్సి ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేయనున్న ప్రాంతం అనువైనదేనని అధికారులు తనిఖీ చేసి నిర్ధారించారు. ఇప్పటికీ భూమి అప్పగింతతో ఆలస్యమవుతోంది. రణస్థలం మండలం చిట్టివలసలో రూ.720 కోట్లతో ఏడాదికి 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ఔషధాలు ఉత్పత్తి చేసేందుకు సంబంధిత యాజమాన్యం ముందుకొచ్చింది. పరిశ్రమలో ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా వెయ్యి మందికి ఉపాధి కల్పించేందుకు అంగీకరించింది. పరిశ్రమకు 13.91 ఎకరాల భూమి కావాల్సి ఉంది. ప్రస్తుతం భూ పరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రాంతం అనువైనదేనని అధికారులు నిర్ధారించారు. ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతులు రాలేదు. ఎచ్చెర్ల మండలం అల్లినగరంలో రూ.65 కోట్లతో రసాయనిక పరిశ్రమ ఏర్పాటుకు ఎన్‌ఎసిఎల్ ముందుకొచ్చింది.పరిశ్రమలో 200 మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయి

**యాజమాన్యాల తీరుపై కార్మికుల ఆందోళనలు**

రణస్థలం మండలం శ్యాంపిస్టన్స్ ప్లాంట్-2లో 30 సంవత్సరాలు పూర్తయిన కార్మికులను తొలగించేందుకు యాజమాన్యం ప్రయత్నించిన సందర్భంలో సిఐటియు ఆధ్వర్యాన్న కార్మికులు అనేక రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. ప్రస్తుతం కల్పిస్తున్న 14 రోజుల పనిదినాలు కాకుండా పూర్తిస్థాయిలో పని కల్పించడం కోసం మరోవైపు న్యాయ పోరాటం సాగిస్తోంది. సిఐటియు చేసిన సాగించిన పోరాటాల ఫలితంగా నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమలో వేతన ఒప్పందానికి యాజమాన్యం ముందుకొచ్చింది. యునైటెడ్ బెవరేజెస్‌లో కార్మికులకు ఇప్పుడు కల్పిస్తున్న 13 రోజుల పని దినాలు కాకుండా పూర్తిస్థాయి పని దినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ పలురూపాల్లో ఆందోళనలు చేపట్టారు. కార్మికశాఖ అధికారులు జోక్యంతో ప్రస్తుతం పనిదినాల సంఖ్య పెంచారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు (ఫైల్)

**సమస్యలపై రోడ్డెక్కిన స్కీమ్ వర్కర్లు**

అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్ల సాధనకు ప్రభుత్వం జరిపిన చర్చలు విఫలం కావడంతో అనివార్యంగా సమ్మెకు దిగాల్సి వచ్చింది. గతేడాది డిసెంబర్ 12 నుంచి ఈ ఏడాది జనవరి 22 వరకు 42 రోజుల పాటు సమ్మె చేశారు. సమ్మెలో భాగంగా ధర్నాలు, రాస్తారోకోలు, మానవహారాలు, బిక్షాటన, వంటావార్పు, కొవ్వొత్తుల ర్యాలీ, సత్యాగ్రహ దీక్షలు, 24 గంటల నిరాహార దీక్షలు వంటిం రూపాల్లో ఆగ్రహం వ్యక్తం చేశారు.

అప్పటి మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు ఇళ్లను ముట్టడించడం, ఎమ్మెల్యేల జిల్లా వంటావార్పు, కలెక్టరేట్ వద్ద బైఠాయింపు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వానికి తమ నిరసనను తెలిపారు. ఒకానొక దశలో వారిని తొలగించేందుకు సిద్ధపడిన అంగన్‌వాడీలు ఐక్యంగా నిలిచి పోరాటాన్ని ఉధృతం చేయడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఎన్నికల తర్వాత వారి డిమాండ్లను నెరవేరుస్తామంటూ హామీనిచ్చింది. ఎన్నికల తర్వాత వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వమూ వారి సమస్యల పరిష్కారంపై దృష్టిసారించలేదు. ఆశావర్కర్లపై పనిభారం తగ్గించాలని, జాబ్‌ఛార్టులో లేని పనులు అప్పగించొద్దంటూ ఈ ఏడాది జూన్‌లో డిఎంహెచ్‌ఒ, పిహెచ్‌సిల్లో ధర్నాలు చేపట్టారు. ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న కమ్యూనిటీ వర్కర్లను ఆశావర్కర్లుగా మార్చాలంటూ ఐటిడిఎ, పిహెచ్‌సిల వద్ద ఆందోళనలు చేపట్టారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరిలో డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు.

# బహిరంగ ప్రదేశాల్లో వేడుకలొద్దు

**శ్రీకాకుళం :** ఈ నెల 31 రాత్రి నూతన సంవత్సరం వేడుకలు సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో, రోడ్లపై నిర్వహించరాదని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సేవించి, లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడపరాదన్నారు. వేగంగా డ్రైవింగ్, బైక్ రేస్‌లు, ట్రిపుల్ రైడింగ్‌లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. అందులో పట్టుబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత ప్రజలు ఎవరు రోడ్లపై తిరగరాదన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి కూడళ్ల వద్ద పోలీసు బృందాలు ఉంటాయని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో కేకులు కట్ చేయడం, పార్టీలు, డిజెలు, లౌడ్ స్పీకర్లు ఉపయోగించి ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా డాన్స్‌లు, నృత్యాలు చేయడం నిషేధించామన్నారు. ఏ విధమైన మందుగుండు సామగ్రి కాల్చరాద న్నారు. ఒకేచోట గుమిగూడి, ప్రజాశాంతికి, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించరాదన్నారు. మహిళను, యువతులను ఈవ్ టీజింగ్ చేసే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం దుకాణాలు, బార్‌లను ప్రభుత్వం నిర్ణయించిన సమయం వరకు మాత్రమే నిర్వహించాలన్నారు. హోటళ్లకు, రెస్టాంట్లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాలకు ఎటువంటి అనుమతులు లేవన్నారు.

# నిర్మానుష్య ప్రదేశాల్లో డ్రోన్ల నిఘా

**శ్రీకాకుళం:** నిర్మానుష్యమైన ప్రదేశాల్లో డ్రోన్ల నిఘా పెట్టి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పోలీసులు అడ్డుకట్ట వేశారు. ఈ మేరకు శ్రీకాకుళం టూ టౌన్ పట్టణ పరిధిలో ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు పిఎన్ కాలనీ, భైరివానిపేట, కిమ్స్ ఆస్పత్రి, శాంతి నగర్ కాలనీ, నదీ పరివాహక ప్రాంతాలు, పట్టణ చివర ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం తాగడం, గంజాయి సేవించడం, పేకాట, ఈవిటీజింగ్, చైన్ స్నాచింగ్ తడితర నేరాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. పాడుబడిన బంగ్లాలు, నివాస గృహాలపై డ్రోన్ కెమెరాలతో చిత్రీకరిస్తారు. బహిరంగంగా మద్యం తాగడం, గంజాయి సేవించడం వంటి వారు పట్టుబడితే చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగ మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణ, ఈవ్ టీజింగ్, ఇతర నేరాలపై చర్యలు చేపట్టనున్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

## సోలార్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పిఎం సూర్యా ఘర్ పథకం ద్వారా సోలార్ పవర్‌ను ప్రతి ఒక్కరూ గృహాలకు వినియోగించుకుంటే కరెంట్ బిల్లులు తగ్గుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పిఎం సూర్య ఘర్ సోలార్ పథకం ద్వారా 3 కెవి కెపాసిటీ, రెండు యూనిట్లను తన స్వగృహానికి ఏర్పాటు చేసుకుని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సమకూరుస్తున్న సబ్సిడీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుంటే ఐదేళ్లలో కట్టవలసిన విద్యుత్ బిల్లు ద్వారా ఈ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు. తర్వాత మిగులు విద్యుత్‌ను గ్రిడ్డుకు, ఇతర అవసరాలకు అమ్ముకోవచ్చని తెలియజేశారు. ఈ సోలార్ పవర్ పథకానికి దరఖాస్తు చేసిన 15 రోజుల్లో విద్యుత్‌శాఖ అధికారులు ఏర్పాటు చేయడంపై ఎస్ఇ, ఇఇ, సిబ్బందికి అభినందించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్ఇ ఎన్.కృష్ణమూర్తి, నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షులు గొండు స్వాతి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కవితను వినిపిస్తున్న కవి వెంకట రాజారావు

## మహాసభలో 'కుప్పిలి' కవితా గానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రపంచ తెలుగు మహాసభలో కుప్పిలి కవితా గానం పలువురిని ఆకట్టుకుంది. శనివారం విజయవాడ కెబిఎన్ కళాశాల ప్రాంగణంలో ప్రముఖ సాహితీ వేత్త గుత్తికొండ పూర్ణచందు, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో జరిగిన కవి సమ్మేళనంలో పట్టణానికి చెందిన రచయిత కవి కుప్పిలి వెంకట రాజారావు 'జింక బాణం సంధిస్తే' అనే కవితను చదివి ఆహుతులను అలరింపజేశారు. కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

**ఇచ్ఛాపురం :** మొక్కల పెంపకం సామజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ గుర్తించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల ప్రిన్సిపాల్ వి.శంకరరావు అన్నారు. కళాశాల మైదానం ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.రజనీ కుమారి ఆధ్వర్యాన శనివారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు పర్యావరణ, ఆత్మీయ నేస్తాలని తెలిపారు. విరివిగా చెట్లు పెంపకం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని కాపాడుకోవచ్చు అని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రియాసుధాకర్, ఆర్.యుగంధర, ఎన్.బాపూజీ, పి.ప్రసాదరావు, కె.జగదీష్, బి.కరుణాకరరావు, బి.సునీత పాల్గొన్నారు.

# మమ్మల్ని గుర్తించండి!

- బెంతు ఒరియాల ఆవేదన
- కుల ధ్రువీకరణ కోసం ఆరాటం
- రిలే నిరాహారదీక్షలకు ఏడాది

ప్రజాశక్తి- కవిటి

తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి ఈ దేశంలో మేము కూడా ఉన్నామంటూ తమను గుర్తించాలని ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని బెంతు ఒరియాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఉన్న ప్రజలందరికీ ఏదోఒక కులం ఉందని, తాము మాత్రం కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో గుర్తింపు లేని వారిగా మిగిలామని కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికైనా ఈ దేశంలో తాము కూడా ఒక భాగమని, తమకూ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి తమని గుర్తించాలని వారు కోరుతున్నారు.

**దీక్షలకు ఏడాది**

పూర్వస్థాయిలో కులం, ఉప కులంతో కూడిన ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ (నివాసం, కులం, పుట్టిన తేదితో కూడిన ధ్రువీకరణ పత్రం) మంజూరు చేయాలని కోరుతూ ఇచ్ఛాపురం నియోజక వర్గం బెంతు ఒరియాలు కవిటి బస్టాండ్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 365 రోజులకు చేరుకున్నాయి. అయితే డిసెంబర్ 28, 2023లో ప్రారంభించిన ఈ రిలే నిరాహార దీక్షలు ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని నిర్విరామంగా కొనసాగడంలో బెంతు ఒరియా యువత కీలక పాత్ర పోషించిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

**ఎస్‌టి సర్టిఫికెట్ కావాలంటూ...**

కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో నివసిస్తున్న పురియా, జన్నా, సాహు, మజ్జి, దొలాయి, బిసాయి, కొన్నాయి అనే ఇంటి పేరుతో ఉన్న బెంతు ఒరియా ప్రజలకి 1976 నుంచి 2003 వరకు ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేవారిని రిలే నిరాహార దీక్ష పోరాట సభ్యులు అంటున్నారు. కానీ ఎక్కడో సంతబొమ్మాళి మండలంలో ఉన్న ఒరియా కాని వారు బెంతు ఒరియాల పేరుతో తప్పుడు ఎస్‌టి సర్టిఫికెట్లు తీసుకోవడంతో అకారణంగా తాము అన్యాయానికి గురయ్యామని వారు వాపోతున్నారు. ఆ తరువాత 2017 నుంచి 2023 జనవరి వరకు ఆన్‌లైన్లో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ తమకు జారీ చేసే వారిని కనీ గాని 21 నెలలుగా అధికారుల నిలిపివేయడంతో తమ విద్యార్థులు, యువతకు మొత్తంగా తమ వ్యవస్థకే సమస్యలు మొదలయ్యాయని వీరు మొరపెట్టుకున్నారు.

దీక్షల్లో పాల్గొన్న బెంతు ఒరియాలు

**ఎటూ తేల్చని కమిషన్లు**

మరోవైపు బెంతు ఒరియాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే పలు కమిషన్లు వేయడం, వాటిలో కొన్ని తమ నివేదికలు ఇవ్వడం కూడా జరిగింది. 2008లో మహాత్మా గాంధీ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ సోషల్ సోషల్ యాక్తవిస్ట్, ప్రముఖ మానవ శాస్త్రవేత్త ఆధ్వర్యంలో కమిషన్ వేశారు. ఆ తర్వాత 2017లో విశాఖపట్నం ఆంధ్రోపాజీ హెచ్ఓడి పిడి సత్యపాల్ ఆధ్వర్యంలో మరో కమిటీ వేశారు. ఆ తర్వాత 2019 సెప్టెంబర్‌లో విశ్రాంత ఐఎఎస్ అధికారి జెసి శర్మ నేతృత్వంలో వన్ మ్యాన్ కమిషన్, 2022 అక్టోబరులో విశ్రాంత ఐఎఎస్ ఐ.శ్యామ్యూల్ ఆనంద్ నేతృత్వంలో మరోసారి వన్ మ్యాన్ కమిషన్ ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వాలు మారినప్పుడల్లా కమిషన్ల మార్పు తప్పా జరిగింది శూన్యం. ఆ కమిషన్లు అసలు నివేదికలు రూపొందించాయా? రూపొందిస్తే అందులో ఏయే విషయాలు పొందుపరిచాయి? అనే అంశాలు ఇప్పటికీ బహిర్గతం చేయలేదు.

**కూటమి ప్రభుత్వంపై ఆశలు**

ఇటీవల ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బెంతు ఒరియాల సమస్య సభలో ప్రస్తావించారు. ప్రభుత్వ విప్ ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్ వీరి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి దీనిపై సాధ్యాసాధ్యాలు పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, అంతవరకూ వారికి నేటివిటి సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అసెంబ్లీ సాక్షిగా బెంతు ఒరియాల సమస్యను విప్ అశోక్ ప్రస్తావించారు. వారి సమస్య పరిష్కరించి వారికి న్యాయం చేయాలని కోరారు. దీంతో నియోజకవర్గ బెంతు ఒరియాలు ఇప్పటికైనా తమకో గుర్తింపు లభిస్తే అదేచాలని ఎదురుచూస్తున్నారు.

## మహిళకు గాయాలు

గాయపడిన తులసి

**టెక్కలి రూరల్ :** మండలంలోని సింగు మహంతిపేటకు కె.తులసి రైలు నుంచి జారిపడి గాయపడింది. నౌపడ రైల్వే స్టేషన్‌లో విశాఖ ఎక్స్‌ప్రెస్ ఎక్కుతుండగా. ఈ సమయంలో అదుపు తప్పి జారిపడడంతో గాయపడింది. వెంటనే 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**పలాసలో...**

**పలాస :** మండలంలోని మొగిలిపాడు జాతీయ రహదారి వద్ద ఆగి ఉన్న లారీని ఒడిశా రాష్ట్రం సుర్ల ప్రాంతానికి చెందిన కృష్ణారావు గాయపడ్డాడు. పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు 108లో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

## బెల్లం ఊటలు ధ్వంసం

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట ఎక్సైజ్ పరిధిలోని మందస మండలం రామరాయ సమీపంలో నిల్వ ఉంచిన 600 లీటర్ల బెల్లం ఊటలను శనివారం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.బేబి తెలిపారు. శ్రీకాకుళం ఎన్‌ఫోర్స్‌మెంట్, పలాస, సోంపేట ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించామన్నారు. ఎం.జి.పురం వద్ద పది లీటర్ల నాటుసారాతో వ్యక్తిని, కోరంజిభద్ర వద్ద పది లీటర్ల సారాతో మరొక వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## కొడుకు ఆచూకీ కోసం ఆవేదన

ప్రజాశక్తి- బూర్జ

విలేకరులతో మాట్లాడుతున్న రాధాకుమారి సాహు

కనిపించకుండా పోయిన తన కుమారుడి ఆచూకీ కోసం ఓ తల్లి తీవ్ర ఆవేదనకు గురవుతుంది. శనివారం స్థానిక విలేకరుల ఎదుట కొడుకు ఆచూకీ కోసం ఆ తల్లి వాపోయింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన రాధాకుమారి సాహు తన కుమారుడు సంతోష్ కుమార్ సాహు కనిపించకుండా పోయాడని గతేడాది స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే ఇంతవరకు ఏడాది గడుస్తున్నా తన కుమారుడి ఆచూకీ తెలియలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఉన్న ఒక్కగానొక్క కొడుకు కనిపించకుండా పోవడంతో ఒంటరిగా మిగిలానని, పోలీసులకు విన్నవించుకోగా పట్టించు కోవడంలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, పోలీస్‌లు తన కుమారుడి ఆచూకి కనిపెట్టి తను వద్దకు చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరింది.

లావేరు : వార్డెన్‌ను ప్రశ్నిస్తున్న ప్రత్యేకాహ్వానితులు బాలకృష్ణ

## వార్షిక బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మెరుగు రాజేశ్వరి అధ్యక్షతన శనివారం వార్షిక బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. 2024-25కు రూ.51.81 కోట్లు గాను, రూ3.34 లక్షల మిగులుతో సవరణ బడ్జెట్, రూ.57.26 కోట్లకు గాను, రూ.17.80 లక్షల మిగులుతో అంచనా బడ్జెట్‌ను తయారు ఆమోదించారు. ఈ మేరకు ఎంపిడిఒ పి.జయంతిప్రసాద్ ఆధ్వర్యాన సీనియర్ అసిస్టెంట్ నర్సింగరావు బడ్జెట్ ప్రణాళికలను విడుదల చేశారు. సమావేశానికి పలువురు ఎంపిటిసిలు, అధికారులు గైర్హాజరయ్యారు. దీంతో అందుబాటులో ఉన్న 9 మంది సభ్యులతో బడ్జెట్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంత రెడ్డి, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

**పోలాకి:** సభ్యులందరి ఆమోదంతో 2024-25 సంవత్సరానికి బడ్జెట్‌ను ఆమోదించామని ఎంపిపి ముద్దాడ దమయంతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 బడ్జెట్ అంచనాలు, నిధులు సమీకరణ, కేటాయింపులు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం అందరి అంగీకారంతో బడ్జెట్‌ను రూ.14,64,000 అంచనాలు ఉండగా, ఈ ఏడాది రూ.20,67,500కు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, ఎంపిడిఒ జి.రవికుమార్, వైస్ ఎంపిపిలు కలదండ తాతారావు, కోట అప్పారావు, సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, ఇఒపిఆర్‌డి పద్మావతి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

**లావేరు:** మండల పరిషత్ 2024-25 సవరణ, 2025-2026 అంచనా బడ్జెట్‌ను మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆమోదించారు. శనివారం ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి మౌనం పాటించారు. అనంతరం ఎంపిడిఒ పి.వెంకటరాజు సభలో 2024-2025 సవరణ బడ్జెట్‌ను చదివి వినిపించారు. ఆదాయం రూ.62 లక్షలు, వ్యయం రూ. 60.45 లక్షలు, మిగులు రూ 1.55000 లక్షలగాను,

నౌపడ : వార్షిక బడ్జెట్ విడుదల చేస్తున్న అధికారులు

2025-2026 అంచనా బడ్జెట్ ఆదాయం రూ. 64.లక్షలకుగాను, వ్యయం రూ.62.40 లక్షలు, మిగులు రూ. 1.60 లక్షలుగా చదివి వినిపించారు. దీనికి సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ శాఖల వారిగా సమీక్షించారు. ప్రభుత్వ వసతి గృహాల్లో మోను అమలు తదితర సమస్యలపై తమకు పలు ఫిర్యాదులు వస్తున్నాయని మండల ప్రత్యేక ఆహ్వానితులు వార్డెన్లను ప్రశ్నించారు. నెలవారీ సమగ్ర నివేదికలు ఇవ్వాలని ఎంపిడిఒ, ఎంఇఒ, తాను వసతిగృహాలు తనిఖీ చేస్తామని బాలకృష్ణ వెల్లడించారు. సమావేశంలో జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసరావు, ఎంపిటిసిల సంఘం అధ్యక్షుడు తవిటినాయుడు, బుడతావలస ఎంపిటిసి సాయికుమార్, పిల్లా రాము, అధికారులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : వినతులను స్వీకరిస్తున్న తహశీల్దార్ పాపారావు

## రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కారమవుతాయని తహశీల్దార్ బడ్డే పాపారావు సూచించారు. మండలంలోని మెళియాపుట్టిలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సుమారు 11కి పైగా దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీ సర్వేలో ఏమైనా సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు ఉపయగపడతాయని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి మాజీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్ రెడ్డి, జగన్మోహనరావు, సర్వే డిటి వెంకటరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

**కవిటి:** మండలంలోని మాణిక్యపురంలో తహశీల్దార్ మురళీమోహన్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మ్యూటేషన్లకు సంబంధించి వినతులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిటి కృష్ణమూర్తి, ఆర్ఐ రమణమూర్తి, సర్వేయర్ మల్లికార్జున పానిగ్రాహి, విఆర్ఒ గిరిబాబు పాల్గొన్నారు.

**నందిగాం :** గ్రామస్థాయిలో ఉండే భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. మండలంలోని నందిగాం, భరణిగ, దేవాడ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ హనుమంతరావు, సింహాచలం పాల్గొన్నారు.

మోడల్ పేపర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

## మోడల్ టెస్టు పేపర్ల పంపిణీ

ప్రజాశక్తి- మందస

గత 15 ఏళ్ల యుటిఎఫ్ ఆధ్వర్యాన ముద్రించిన పదో మోడల్ పేపర్ల నుంచి పబ్లిక్ పరీక్షల్లో 80 శాతానికి పైగా ప్రశ్నలు వస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గున్న రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ గుంట గోవిందరావు అన్నారు. మండలంలోని హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గవర ఉమారాజు అధ్యక్షతన శనివారం మెడల్ టెస్టు పేపర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించేందుకు మోడల్ టెస్టు పేపర్లు విద్యార్థులకు ఉపయోగ పడుతున్నట్లు తెలిపారు. యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది మారిన సిలబస్ ఆధారంగా రూపొందించిన పుస్తకాలను ఎక్కువ మంది విద్యార్థులతో చదివించి మంచి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జనవరి 5,6,7,8 తేదీల్లో కాకినాడలో నిర్వహించనున్న యుటిఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలకు మండలం నుంచి ఎక్కువ మంది ఉపాధ్యాయులు హాజరు కావాలన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షులు జన్ని సోమేశ్వరరావు, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఎం.చక్రధరరావు, జి. రమణ బాబు, జి.తేజేశ్వరరావు, కె.శేషగిరిరావు, పి.లోకనాథం, ఎస్.రేణుక, కె.అరుణకుమారి, పి.జగన్మోహనరావు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

## మరమ్మతు పనులు ప్రారంభం

**టెక్కలి రూరల్:** మండలంలోని సీతాపురం నుంచి భీంపురం, అలాగే లింగాలవలస నుంచి మద్రిపాడు వరకు తారురోడ్లు మరమత్తుల పనులు లింగాలవలస పంచాయతీ మాజీ సర్పంచ్ సంపతిరావు రవీంద్రనాథ్, ఎంపిటిసి మాజీ సభ్యులు కెల్లి శ్రీరాములు, శనివారం ప్రారంభించారు. సుమారు రూ.20 లక్షలతో పనులతో ప్రారంభించామని తెలిపారు. వైసిపిలో కనీసం మట్టితో కూడా గొయ్యిలు చెప్పలేదని ఆరోపించారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు చూసి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలతో ఈ రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో రోణంకి లక్ష్మీ నారాయణ, బగాది సునీల్, అల్లు మాధవరావు, సంపతిరావు తవిటిరాజు, తమ్మినేని శ్రీనివాసరావు, అన్నెపు శ్యామసుందరరావు, బగాది సుధీర్, దవల శరత్ కుమార్, అన్నెపు పురుషోత్తం, ఈరెసుపేట కృష్ణారావు, జన్ని లచ్చయ్య, మోహన్ పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న గిరిబాబు

## చురుగ్గా కల్వర్టు నిర్మాణ పనులు

**పొందూరు:** మండలం రాపాకలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరి బాబు ఆధ్వర్యంలో శనివారం కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. పాఠశాల ముందు ప్రధాన రహదారి కల్వర్టు మూసుకుపోవడంతో మురుగునీరు రహదారిపై నిలిచిపోతుంది. దీంతో సమీపంలో ఉన్న ఎస్‌సి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడడంతో పాటు రాక పోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. కల్వర్టు నిర్మాణం పనులు చేపట్టడంతో కాలనీ వాసులతో పాటు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## జాబ్‌మేళాలో 35 మంది ఎంపిక

**రణస్థలం:** న్యూలాండ్ పరిశ్రమ, హైదరాబాద్ ఆధ్వర్యంలో రణస్థలం మండల కేంద్రంలోని సాయి జూనియర్ కళాశాలలో ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నిర్వహించిన జాబ్ మేళాలో 35 మంది ఎంపికైనట్లు కో-ఆర్డినేటర్ విజయకృష్ణ తెలిపారు. వీరికి పరిశ్రమ యాజమాన్యం డిగ్రీ ఉచితంగా చదివించడంతో సహా ఏడాదికి రూ.2 లక్షల వేతనం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కామేశ్వరరావు, బలివాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులు

## 'బయోసైన్స్'తో వ్యాధులకు అడ్డుకట్ట

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

బయోసైన్స్ రంగంలో జరుగుతున్న నూతన పరిశోధనలు....ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనడానికి ఎంతగానో తోడ్పడుతున్నాయని డా.బి.ఆర్. అంబేద్కర్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత అన్నారు. శ్రీవెంకటేశ్వర యూనివర్శిటీ (తిరుపతి) బయో టెక్నాలజీ విభాగం 'జీవ సాంకేతికత, మెడిసన్ మరియ కేన్సర్ చికిత్సా విధానాలు' అనే అంశంపై మూడు రోజులు పాటు నిర్వహిస్తున్న అంతర్జాతీయ సమావేశంలో శనివారం జరిగిన ప్రత్యేక సెషన్‌లో 'మెదడు, నరాలకు సంబంధిన నాడీ మండల వ్యాధి శస్త్ర చికత్స అనంతర వైద్య, జీవరసాయన, పరమాణు కారకాలు' పై ప్రసంగించారు. నూతన సాంకేతికతతో బయోసైన్స్ రంగంలో జరుగతున్న ఆవిష్కరణలు, వ్యాక్సిన్లు, కేన్సర్ వంటి వ్యాధులు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యమ్నాయ మార్గాలను చూపుతున్నాయన్నారు. వైద్యరంగానికి అత్యంత సహాయకారిగా నిలుస్తున్న ఈ తరహ అధ్యయనాలు మరింతగా పెరగాలన్నారు. అలబామా బర్మింగ్లామో యూనివర్శిటీ (అమెరికా)తో కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సమావేశంలో కేన్సర్ చికిత్సా విధానాలైన టార్గెట్ థెరఫీ, ఇమ్యునో థెరఫీ, ఆధునిక రేడియో థెరఫీ, తొలిదశలో వ్యాధి గుర్తింపు, సంబంధిత పరిశోధనల్లో ఎదురవుతున్న సవాళ్లతో పాటు డిజిటల్ హెల్త్, టెలిమెడిసన్, జీనోమిక్ మెడిసిన్, ఇండస్ట్రీ బయోటెక్నాలజీ తదితర అంశాలపై చర్చ జరిపారు. శ్రీ వెంక టేశ్వర 'వర్శిటీ బయోటెక్నాలజీ విభాగాధిపతి. డా. కె.వి. సరిత, డా. ఎం. మిధున్ (జి.ఐ. మెడికల్ అంకాలజీ), డా. జి. పూర్ణ చంద్ర నాగరాజు (అలబామా వర్శిటీ)లు కన్వీనర్‌లుగా వ్యవహరించిన ఈ సమావేశంలో వివిధ దేశాల నుంచి సంబంధిత అధ్యాపకులు, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల హక్కుల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

రాజ్యాంగం ఆదేశిక సూత్రాల ప్రకారం విశ్రాంత ఉద్యోగులకు గౌరవప్రదమైన జీవితం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని 'ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్' అధ్యక్ష కార్యదర్శులు డి.పార్వతీశం, మణికొండ ఆదినారాయణమూర్తి అన్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో 'పెన్షనర్స్ డే' సందర్భంగా శనివారం నిర్వహించిన వివిధ కేంద్ర, రాష్ట్ర, ప్రైవేట్ సంస్థల విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో వారు మాట్లాడారు. పెన్షన్ దయాభిక్ష కాదు, ఉద్యోగుల హక్కు అని 1982లో సుప్రీంకోర్టు తీర్పు నిచ్చిందని వారు గుర్తు చేశారు. ఇందుకు విరుద్ధంగా ఈ రోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి పెన్షన్ ప్రయోజనాలను వ్యతిరేకంగా ఉందని వారు విమర్శించారు. యుపిసి, సిపిఎస్ రద్దుచేసి అందరికీ ఒపిఎస్ అమలు చేయాలన్నారు. ఇపిఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ తొమ్మిది వేలు కరువు భత్యం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు 2022లో ఇచ్చిన తీర్పు మేరకు అందరికీ హయ్యర్ పెన్షన్ వచ్చేటట్టు అమలు చేయాలన్నారు.. పదవీ విరమణ సమయంలో విశ్రాంత ఉద్యోగుల సదుపాయాలు జాప్యం లేకుండా చెల్లించాలని వారు కోరారు. పెన్షనర్ల సమస్యలపై సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని లేని పక్షంలో రానున్న రోజుల్లో పెన్షనర్లలో మరింత అసంతృప్తి పెరుగుతుందని వారు హెచ్చరించారు. సమావేశంలో ఎడ్యుకేషన్, బ్యాంకు, ఎల్‌ఐసి, బిఎస్ఎన్ఎల్, రైల్వే, స్టీల్ ప్లాంట్, ఆర్ అండ్ బి, పీర్లెస్, మెడికల్ అండ్ హెల్త్, డిసిసిబి, ఆర్‌టిసి, విఎఒ తదితర సంఘాల ప్రతినిధులు తమ సమస్యలపై మాట్లాడారు. ఈ సందర్భంగా సమావేశంలో ఇటీవల మరణించిన విశ్రాంతి ఉద్యోగుల నాయకులు వీరభద్ర స్వామికి సంతాపం తెలిపారు. పెన్షనర్ సమస్యలపై ఫిబ్రవరి 26న విశ్రాంతి ఉద్యోగుల సదస్సు భారీగా నిర్వహించాలని సమావేశం నిర్ణయించిందన్నారు. అనంతరం 22 మంది వివిధ సంఘాల ప్రతినిధులతో కోఆర్డినేషన్ కమిటీ ఏర్పడింది. కోశాధికారి పి సుధాకరరావు వందన సమర్పణ చేశారు.

సమావేశమైన వివిధ ప్రభుత్వశాఖల విశ్రాంత ఉద్యోగులు

## తీర్మానాలే తప్ప అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వంలో ఏర్పడిన మున్సిపల్ పాలకవర్గం ప్రారంభంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానాలు చేశారు తప్ప ఎక్కడా పనులు చేపట్టలేదని మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, కౌన్సిలర్లు గుజ్జు జోగారావు, పిచ్చుక అజయ్, జోగ త్రివేణి, తంగుడు ఆశాలత, దుర్గాశంకర్ పండా, బెల్లారి శ్రీనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన శనివారం సాధారణ సమావేశం నిర్వహించారు. మెదటి సమావేశాల్లో అభివృద్ధి పనులపై చేసిన తీర్మానాలపై ఇప్పటికీ పూర్తి కాని పరిస్థితి ఉంటే... ఇప్పుడు కొత్తగా అభివృద్ధి పనులు అజెండాలో పెట్టి అమెదించినా ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. తమ తమ వార్డుల్లో 2021లో ఆమోదించిన పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదన్నారు. దీనిపై చైర్మన్ సమాధానం చెబుతూ మనకు వచ్చిన ఆదాయంతో సాధారణ నిధులు వెచ్చించి ప్రాధాన్యతాక్రమంలో పనులు చేపట్టామని అన్నారు. అధికారులు మార్పుతో బిల్లులు కూడా సక్రమంగా విడుదల కాకపోవడం లేదన్నారు. దీనివల్ల కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని తెలిపారు. కమిషనర్ ఎన్.రామారావు మాట్లాడుతూ కౌన్సిలర్లు జోగ త్రివేణి, తంగుడు ఆశాలత లేవనెత్తిన పనులను వచ్చే సమావేశం నాటికి టెండర్ పక్రియ పూర్తి చేస్తామన్నారు. కౌన్సిలర్లు దువ్వాడ శ్రీకాంత్, గుజ్జు జోగారావు, దుర్గా శంకర్ పండా, కౌన్సిలర్ బోర చంద్రకళ, సవర సోమేశ్వరరావు, డిక్కల ఆనందరావు, సనపల సింహాచలం, బళ్ల రేవతి, పోతనపల్లి ఉమ, మున్సిపల్ డిఇ కనకరాజు, ఎఇలు పాల్గొన్నారు. ముందుగా మృతి చెందిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

నిలదీస్తున్న కౌన్సిలర్ సూర్యనారాయణ (ఇన్‌సెట్‌లో మాట్లాడుగున్న గిరిబాబు)

## తీరం చేరుకుందామా..

- పర్యాటక రంగానికి ప్రాధాన్యత
- రూ.1.72 కోట్లతో రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి- కవిటి

మండలానికి ఆనుకుని ఉన్న సుందర సముద్ర తీరానికి ప్రభుత్వం మరింత సొబగులు అద్దే ప్రయత్నం చేస్తోంది. తద్వారా పర్యాటకుల సంఖ్య పెరిగి ఈ రంగానికి మరింత ప్రాధాన్యత చేకూర్చేలా చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా మొదటి ప్రాధాన్యతగా నేరుగా సముద్ర తీరానికి చేరుకునేలా పూర్తిస్థాయి పక్కా రహదారుల నిర్మాణం చేపడుతోంది. మండలంలోని నెలవంక గ్రామం నుంచి సముద్ర తీరానికి కలుపుతూ కిలో మీటరు రహదారి, పుక్కళ్లపాలెం గ్రామం నుంచి తీరానికి చేరేలా రెండు రహదారులు, పెద్దకర్రివానిపాలెం నుంచి తీరాన్ని చేరేలా ఓ రహదారి నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఈ పనులు పూర్తయితే మండలంలోని సముద్ర తీరానికి పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. అంతే కాకుండా రన్నింగ్, జాగింగ్ చేసే యువకులకు, మార్నింగ్ వాకింగ్ చేసే వాళ్లకు తీరం తోరణమవుతుంది. మరోవైపు రహదారుల నిర్మాణం

పరిశీలిస్తున్న ఇఇ సూర్య ప్రకాష్, జెఇఇ ప్రవీణ్ కుమార్

నిర్మించిన సిసి రోడ్డు

పూర్తయిన తర్వాత తీరంలో దశల వారీగా పర్యాటక సొబగులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. తద్వారా పర్యాటకులను ఆకర్షించి ఉద్దానం ప్రాంతానికి పర్యాటక ప్రాధాన్యత కల్పించేలా చర్యలు చేపడుతోంది. ఈ సందర్భంగా ఇటువంటి బృహత్ కార్యక్రమం మండలంలో శరవేగంగా అమలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్‌కు అటు నెలవంక ప్రజలు, ప్రజా ప్రతినిధులతో పాటు తీర ప్రాంత వాసులు కృతజ్ఞతలు చెబుతున్నారు. తమ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందితే అంతకుమించి తమకేం కావాలని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**జనవరి 10లోగా పూర్తి చేస్తాం**

సముద్ర తీరానికి చేరుకునేలా మండలంలో రూ.1,72 కోట్లతో రహదారుల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. జనవరి 10లోగా పనులు పూర్తిచేయాలని ప్రభుత్వ ఆదేశం. దానికి అనుగుణంగానే పనులు చేస్తున్నాం. పనులు పూర్తయితే తీరానికి పర్యాటకుల తాకిడి పెరిగి మండలం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది.

- పి.ప్రవీణ్ కుమార్, జెఇఇ, కవిటి

## సచివాలయం దారి అడ్డగింత

- రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందుల్లో ప్రజలు, ఉద్యోగులు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని గుర్రాలపాళెం సచివాలయానికి ప్రజలు, ఉద్యోగులు రాకపోకలు సాగించేందుకు దారిలేకుండా కొంతమంది గ్రామస్తులు ఇబ్బందులు పెట్టడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుర్రాలపాళెం సచివాలయం పరిధిలోని పెద్దకొత్తపల్లి, పాత కుంకాం పంచాయతీలకు ఇదే సచివాలయం. సచివాలయానికి వివిధ పనులపై వచ్చిన ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడు తున్నారు. గత వైసిపి పాలనలో గ్రామానికి చెందిన శాంతాటి శ్రీనువాసరావు సచివాలయ నిర్మాణానికి తన సొంత స్థలాన్ని ఇచ్చారు. అప్పటి ప్రభుత్వం రూ.25 లక్షలతో నూతన సచివాలయ భవనాన్ని శ్రీనువాసరావు, గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు కలిసి భవన నిర్మాణం చేపట్టి ప్రారంభించారు. సచివాలయంలో సిబ్బంది విధులు నిర్వహణ జరుగుతుంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయానికి రహదారి నిర్మాణం చేపట్టాడానికి చర్యలు చేపట్టారు. అయితే ఇక్కడ రోడ్డు వద్దని, భవనానికి మాత్రమే స్థలం ఇచ్చానని, మీరు మెట్లు దాటి రావడానికి లేదని, రాకపోకలు చేసేందుకు వీలులేదని దారి అడ్డగించి ఇబ్బందులు పెడుతుండడంతో సచివాలయం పనులపై వస్తున్న మూడు పంచాయతీల ప్రజలు, సచివాలయ సిబ్బంది అగచాట్లు పడుతున్నారు. తమ పనుల పరిష్కారం కోసం సచివాలయానికి వెళ్లే వీలు లేకపోతే తమ పనులు ఎలా జరుగుతాయని సర్పంచ్‌లు ఆరేళ్ల కృష్ణ, సెటికం వెంకటరమణ, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి సచివాలయానికి వెళ్లేందుకు దారి చూపాలని, సమస్య పరిష్కారం చేయాలని వారంతా కోరుతున్నారు.

దారి లేకుండా ఉన్న గుర్రాలపాళెం సచివాలయం

మిత్రులతో ప్రభుత్వ విప్ అశోక్

## వి(ప్)ప్పారిన ఆనందం

**కవిటి:** ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం అశోక్ శనివారం అలనాటి జ్ఞాపకాలు.. ఆనంద సాగరాల్లో తేలియాడారు. విశాఖపట్నంలో తాను చదువుకున్న ఎటి కళాశాలలో 10వ తరగతి (1998 బ్యాచ్) పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలో పాల్గొన్నారు. తన చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఆత్మీయ ఆలింగనాలు చేసుకున్నారు. ఆనాటి మధురస్మృతులను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా తమతో చదువుకున్న సహచరుడు రాష్ట్రంలో ప్రముఖ స్థానంలో ఉండటంపై తన సహచర మిత్రులు సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో తమ మిత్రుడు మరింత ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. రెండు దశాబ్దాల అనంతరం కలుసుకున్న క్షణాలను మదిలో పదిలపరచుకున్నారు.

నిర్మిస్తున్న సిసి రోడ్డు

## ముమ్మరంగా రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని రహిమాన్‌పురం పంచాయతీలో మాజీ సర్పంచ్ పూజారి సోమేశ్వరరావు ఆధ్వర్యాన శనివారం రోడ్డు నిర్మాణ నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రేగుపాడు సుమారు 500 మీటర్లు పొడవు సిసి రహదారి పనులు చేపడుతున్నారు. రూ.38.50 ఉపాధి హామీ నిధులతో ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. అలాగే రోడ్డుకిరువైపులా ఆణించి ఉన్న పెద్ద చెరువుకు రక్షణ గోడను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## విస్తృతంగా టిడిపి సభ్యత్వం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ముమ్మరంగా టిడిపి సభ్యత్వాన్ని నమోదు చేయిస్తున్నామని మాజీ ఎంపిపి సలాన మోహనరావు, మండల టిడిపి మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని సుర్జిని, మెళియాపుట్టి తదితర గ్రామల్లో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వానికి టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టిఆర్ బీజం వేశారని తెలిపారు. అదే స్ఫూర్తితో సిఎం నారా చంద్రబాబునాయుడు ముందుకెళ్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జాడుపల్లి ఎంపిటిసి ప్రతినిధి కదంబల పైడిరాజు, పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ ఛార్జీలు పెంచిన వాళ్లే ధర్నాలా?

ప్రజాశక్తి- కవిటి

రాజేష్

తమ హయాంలో విద్యుత్ ఛార్జీలు పెంచిన వైసిపి వాళ్లే ఇప్పుడు ధర్నాలు చేయడం విడ్డూరమని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోళ్ల రాజేష్ విమర్శించారు. ఈ ఈ సందర్భంగా శనివారం విలేకరులతో మాట్లాడారు. 2019లో టిడిపి అధికారం కోల్పోయే నాటికి రాష్ట్రం మిగులు విద్యుత్ కలిగి ఉందని, జగన్ అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రం అధోగతి పాలయ్యిందని ఆరోపించారు. ప్రజల సొమ్మును అప్పనంగా తన వారికి దోచిపెట్టేందుకు విద్యుత్ లోటును సృష్టించారని విమర్శించారు. అమలులో ఉన్న పిపిఎలను రద్దు చేయడంతోపాటు సోలార్, విండ్ ఎనర్జీ సంస్థల నిర్వాహకులను బెదిరించి వారిని రాష్ట్రం నుంచి తరిమికొట్టారని పేర్కొన్నారు. దీంతో రాష్ట్రం 10 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను కోల్పోయినట్లు చెప్పారు.

## చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**పలాస :** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ అన్నారు. స్థానిక విద్యావాహిని కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు పైల తిరుమలరావు, ఎ.గిరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం :** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. మండలంలోని బెల్లుపడ కెజిబివిలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ చిన్నం నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# సిక్కోలు డ్వాక్రా బజారుకు మందస ఉత్పత్తులు

ప్రజాశక్తి- మందస

జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్‌హై స్కూల్ మైదానంలో వచ్చే 3న నుంచి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన స్వయం శక్తి సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ఎగ్జిబిషన్ కమ్ సేల్ డ్వాక్రా బజారు చేస్తున్నారని ఐటిడిఎ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని చిన్నబరంపురం మహిళలు తయారు చేసిన హస్తకళలు, కొయ్య బొమ్మల యూనిట్‌కు స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీటిని శనివారం పరిశీలించారు. వీటితోపాటు ప్రత్యేకంగా మందసలో తయారవుతున్న స్వీట్స్, స్నాక్స్, ప్రత్యేకంగా కోవాను డ్వాక్రా బజార్‌కు పంపిస్తున్నట్లు వివరించారు. జిల్లాలోని అందరూ ఈ డ్వాక్రా బజార్‌ను సద్వినియోగం చేసుకొని మీరు తయారు చేసిన వస్తువులను అక్కడ ప్రదర్శించి అమ్ముకోవచ్చని అన్నారు. సందర్శకులు అందరూ మహిళలు ప్రత్యేకంగా తయారు చేసిన వస్తువులను తిలకించి కొనుక్కోవచ్చు అన్నారు. వారం రోజులు తమ వస్తువులను ప్రదర్శించి అమ్ముకోవడానికి వచ్చిన మహిళలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా వసతి, భోజన వసతి కూడా కల్పిస్తారని అన్నారు.

కొయ్య బొమ్మలను పరిశీలిస్తున్న కూర్మారావు

## మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయం

ఇచ్ఛాపురం : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- బూర్జ

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశ ఆర్థిక అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆర్డ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఎన్.సన్యాసిరావు అన్నారు. శనివారం ఆర్డ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మన్మోహన్ సింగ్ సంతాప సభలో మాట్లాడారు. రెండుసార్లు ప్రధానమంత్రిగా, ఆర్థికమంత్రిగా, ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్‌గా, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా ఎన్నో పదవులు చేపట్టి దేశానికి అత్యున్నతమైన సేవలను అందించారన్నారు. కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్ హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ టి.రాజశేఖర్, హరి, ఉద్యాన వనశాఖాధికారి హయంతి, సిబ్బంది ఎన్.అనూప్, బి.శంకరరావు, సిఇఒ మన్యం సహజ ఎఫ్‌పిసి రవి తదితరులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం :** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని శాంతినికేతన్ చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి అన్నారు. ఈ మేరకు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కె.సి.పూర్తి, ఉపాధ్యాయులు పద్మజ, సునీత, యశోద, రవి, ఇంటరాక్టు క్లబ్ ప్రెసిడెంట్ తేజస్, సెక్రెటరీ మోహన్‌ప్రియా, జాయింట్ సెక్రెటరీ డి.హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్.పి.ఎల్.జ్యోష్న పాల్గొన్నారు.

## పశుగ్రాసం పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి- పాతపట్నం

పశుగ్రాస పెంపకంలో నిర్దేశిత లక్ష్యాలను ప్రతిఒక్కరూ సాధించాలని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు సిబ్బందిని ఆదేశించారు. పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశువైద్యాధికారులతో, సిబ్బంది శనివారం పశుగ్రాసం పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కపాడి రైతూ పశుగ్రాసం పెంచుకునేలా సిబ్బంది పనిచేయాలన్నారు. పశుగ్రాసంపై పాడి రైతులకు ఆసక్తి కలిగేటట్లు అవగాహన కల్పించాలన్నారు. 21వ పశుగణ న జనవరి 20లోగా పూర్తి చేయాలన్నారు. మినీ గోకులం నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా పాడి రైతులకు రుణాలు అందేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. సంచార పశు వైద్య సేవలు విస్తృతంగా పాడి రైతులకు అందేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతినెలా టీకాలు వేయాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు బి.శ్రీవాణి, పి.అనిల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కరుణాకరరావు

### దళారులను నమ్మొద్దు

మూర్తి, డిఎస్‌పి

**టెక్కలి రూరల్:** ఎచ్చెర్ల పోలీస్ మైదానంలో కానిస్టేబుళ్ల అభ్యర్థులకు నిర్వహించనున్నట్టు దేహధారుడ్య పరీక్షల్లో దళారులను నమ్మొద్దని డిఎస్‌పి డి.ఎస్.ఆర్.వి.ఎస్.ఎన్.మూర్తి అన్నారు. టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఫిజికల్ పరీక్షల్లో ఉత్తీర్ణత చేయిస్తామని ఎవరైనా నమ్మిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ విషయంలో నిరుద్యోగ అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అలాగే నూతన సంవత్సర వేడుకల్లో యువకులు చట్టవ్యతిరేక చర్యలు చేపట్టరాదన్నారు. ఈయనతో పాటు టెక్కలి అర్బన్ సిఐ అంబటి విజయకుమార్ ఉన్నారు.

### ఆశ్రమ పాఠశాల సందర్శన

**కొత్తూరు:** పదో తరగతి విద్యార్థులు భవిష్యత్ ప్రణాళికలు అమలు చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ విద్యాశాఖ ఎఎంఒ కోటిబాబు అన్నారు. మండలంలోని లబ్బ ఆశ్రమ పాఠశాలను శనివారం సందర్శించారు. విద్యార్థుల విద్యాస్థాయి, వారి రాసిన నోట్ పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించాడు. అలాగే దొండమానుగూడ జిపిఎస్‌లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

## ఆదర్శ పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి- కవిటి

పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ తప్పనిసరిగా పాటించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఇఒలు ధనుంజయ మజ్జి, చిట్టిబాబు సూచించారు. మండలంలోని రాజపురంలో ఉన్న ఆదర్శ పాఠశాలను శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం పనులు పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యత పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల పనివేళలు, సిబ్బంది సమయపాలన తదితర అంశాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎంఇఒలు

## సమస్యల పరిష్కార వేదిక 'ఐతమ్ హేక్రాన్'

సన్మానిస్తున్న నాయుడు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల నిర్వహిస్తున్న జాతీయ స్థాయి హేక్‌ఆన్ ఆవిష్కార్ సమస్కల పరిష్కార వేదికని హైదరాబాద్ సిసిసి డిజిటల్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ ఫౌండర్ సిఇఒ నాగవీర్ ఉండవల్లి అన్నారు. శనివారం నిర్వహించిన 48 గంటల హేక్తాన్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న నైపుణ్యతలను వ్యక్తీకరించుటకు ఈ విదేక ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. వ్యక్తిగతంగా, సామాజికంగా ఉన్న సమస్యలను సాంకేతికత ద్వారా పరిష్కారం చూపడమే విద్య యొక్క ఆవస్యకతని చెప్పారు. ప్రతీ విద్యార్థికి లక్ష్యం ఉండాలని ఆ లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎల్.ఎల్. నాయుడు, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఎస్‌సి-డిలో కొనసాగించాలి

**కోటబొమ్మాళి:** తక్కువ తలసరి ఆదాయం, నిరక్షరాస్యత, నిరుద్యోగం అధికంగా ఉన్న మా ఆది ఆంధ్రా తరగతులు అభివృద్ధి చెందాలంటే ఎస్‌సి వర్గీకరణ చేపట్టి ఇతర ఎస్‌సి ఉపకులాల కేటగిరిలో కలపకుండా ఎస్‌సి-డిలో కొనసాగించాలని స్థానిక హడ్కోకాలనీ వాసులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ ఆర్.అప్పలరాజును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. మా కాలనీలో ఒకే కుటుంబంలో అన్నదమ్ములు ఒకరు ఆదిఆంధ్ర ఎస్‌సి-డి, మరొకరికి ఎస్‌సి మల వేర్వేరుగా ధ్రువపత్రాలు కలిగి ఉన్నాయని అన్నారు. అందుకు రివోక్ ఇప్పించాలని కోరారు. అంతకుముందు స్థానిక పంచాయతీ కార్యాలయంలో విఆర్‌ఒ రంగస్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాళ్ల సంజీవరావు, హడ్కో కాలనీ వాసులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

## దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

నిరసన తెలుపుతున్న సిబ్బంది

**కోటబొమ్మాళి:** అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపిడిఒ జవహర్‌బాబుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎంపిడిఒ కుప్పిల ఫణీంద్రకుమార్ కోరారు. ఈ మేరకు సిబ్బందితో కలిసి నల్లబాడ్జిలు ధరించి శనివారం నిరసన తెలిపారు. ఎంపిడిఒ, అటెండర్ ఇమ్రాన్, కారుడ్రైవర్‌లపై వైసిపి నాయకులు దాడి చేయడం దారుణమన్నారు. ఏ రాజకీయ నాయకుడైనా ప్రభుత్వ ఉద్యోగిపై దాడిచేస్తే కఠినగా శిక్షలు ఉంటాయని భయపడేలా దోషులను శిక్షించాలని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు బోర పార్వతీశం, జూనియర్ సహాయకులు ఎండ వెంకటరామారావు, టైపిస్టు జె.వెంకటరావు, కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు డి.బాలకృష్ణ, బి.నరేష్, వి.రమేష్ పాల్గొన్నారు.

## ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి- మందస

మహిళా స్వయం శక్తి సంఘాల్లో స్వయం ఉపాధిపై నిర్వహించిన శిక్షణలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారని, వారందరికీ నైరేడ్ ద్వారా ధ్రువపత్రాలను పంపిణీ చేశామని ఐటిడిఎ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని సొండిపూడి, మూలిపాడు గ్రామ సంఘాలకు సంబంధించి వారం రోజులుగా కొవ్వొత్తులు, మెరుగైన శానిటేషన్, పినాయిల్ తయారీ, సర్ఫ్ పౌడర్ తయారీపై నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగిసిందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు వస్తు తయారీ యూనిట్లను పెట్టుకుంటున్న స్త్రీనిధి ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్‌ఛార్జి రాంబాబు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు బాలకృష్ణ, తారక మోహన్, స్వామి నాయుడు, ముఖలింగం, విఒఎ తులసీభాయ్, కుసుమకుమారి పాల్గొన్నారు.

ధ్రువపత్రాలతో శిక్షణ పొందేవారు

మాట్లాడుతున్న గణపతి

## ఘనంగా 'జాగృతి' వార్షికోత్సవం

ప్రజాశక్తి- సోంపేట

జగృతి స్థాపించి 16 ఏళ్లలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని అధ్యక్షులు, మనోవికాస నిపుణుడు రామ్‌బుడ్డి గణపతి అన్నారు. మండలంలోని కొర్లాంలో శనివారం సంస్థ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. తహశీల్దార్ అప్పలస్వామి మాట్లాడుతూ జాగృతి సంస్థ 16 ఏళ్ల ప్రస్థానాన్ని అభినందించారు. మరిన్ని సేవా కార్యక్రమాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా వృద్ధ కళాకారులను దుశ్శాలువలతో కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డి.లక్ష్మణరావు, తామడ వాసుదేవరావు, ఆర్.జానకిరామ్, బి.బాలరాజు, పి.జోగారావు, ఆర్.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

### గత ప్రభుత్వ వైఫల్యమే విద్యుత్ ఛార్జీల పెంపు

**నరసన్నపేట :** వైసిపి ప్రభుత్వం పాలన వైఫల్యం వల్లే విద్యుత్ ఛార్జిలు పెంచాల్సి వచ్చిందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. గత టిడిపి ప్రభుత్వం హయాంలో ఉన్న ఒప్పందాలను రద్దు చేసి కమీసన్ల కోసం మాజీ సిఎం జగన్ రివర్స్ టెండరింగ్ పేరిట విద్యుత్ రంగాన్ని కుప్పకూల్చారని ఆరోపించారు. వైసిపి ఉనికి కోసం సరికొత్త డ్రామాలు ఆడుతున్నారన్నారు. గత ఆరు నెలల్లో మంచి ప్రభుత్వమని నిరూపితమైందన్నారు.

### ఎమ్మెల్సీ పరామర్శ

**ఇచ్ఛాపురం :** ఇచ్ఛాపురం పట్టణంలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను ఎమ్మెల్సీ నర్తు రామారావు శనివారం పరామర్శించారు. అయ్యప్ప స్వామి గురువు దుర్గా ప్రసాద్ పట్నాయక్, ఎస్.ఎన్.పండా భార్య మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, వైసిపి నాయకులు ప్రకాశరావు పట్నాయక్, బుచ్చ జగన్, పిలక సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

### రేపు తెంబూరు సంత ప్రారంభం

**పాతపట్నం :** మండలంలో తెంబూరులో సోమవారం సంత ప్రారంభం కాదని సర్పంచ్ బెనియా వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు.కరోనా సమయంలో అధికారుల ఆదేశాల మేరకు సంతను నిలిపివేశామన్నారు. ఇటీవల కలెక్టర్, సెసి, తహశీల్దార్, ఎంపిడిఒలకు వినతిపత్రాలను అందజేశామన్నారు. వారి అనుమతితో మరలా సంతను నిర్వహిస్తున్నామని అన్నారు. తెంబూరు గ్రామ పరిసర ప్రజలు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.